పత్రికా ప్రకటన - 2

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

తేదిః 6.08.2014

తెలంగాణ రాష్ట్రానికి చెందిన క్రీడాకారులను ప్రోత్సహిస్తామని, రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యమిస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు చెప్పారు. తెలంగాణ క్రీడాకారులు అంతర్జాతీయ పోటీలలో పాల్గొనేందుకు అవసరమైన ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తుందని, ఆర్థిక స్తోమత లేకపోవడం వల్ల క్రీడారంగం నుండి పక్కకు తప్పుకోవలసిన అవసరం తెలంగాణ క్రీడాకారులకు రాదని ముఖ్యమంత్రి ప్రకటించారు.

బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్, క్రీడాకారులు గుత్తా జ్వాల , సైనా నెహ్వాల్, పివి.సింధు, కశ్యప్, గురుసాయి, షూటర్ గగన్ నారంగ్, జిమ్నాస్ట్ అరుణ రెడ్డి తదితరులు బుధవారం ముఖ్యమంత్రిని సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో క్రీడాభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకురావలనుకుంటున్న క్రీడా విధానంపై ముఖ్యమంత్రి వారితో చర్చించారు. హైదరాబాద్ నగరంలో గచ్చిబౌలితో పాటు అనేక స్టేడియాలు నిర్మించారని, చాలా క్రీడా మైదానాలు కూడా వున్నాయని అయితే వాటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవటం లేదని ముఖ్యమంత్రి అన్నారు. ఏడాది పొడవునా వాటిలో క్రీడా పోటీలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించుకునే విధంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. హైదరాబాద్ లోని క్రీడా వసతులను వినియోగించుకొంటూనే నగర శివార్లలో అంతర్జాతీయ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేందుకు అనువైన స్పోర్ట్స్ సిటిని నిర్మిస్తామని ప్రకటించారు. అందులో జాతీయ, అంతర్జాతీయ క్రీడలు ఎప్పుడూ జరిగే విధంగా ఇయర్ స్పోర్ట్స్ కాలండర్ రూపొందిస్తామని వెల్లడించారు. ఒలంపిక్స్ కూడా నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్రం సిద్దంగా వుంటుందని ప్రకటించారు. క్రీడా రంగంలో ఇంకా ఏ విధమైన విధానాలు అవలంభించాలి, క్రీడాకారులకు ఏలాంటి ప్రోత్సాహం అందించాలనే విషయంలో సవివరమైన నివేదిక సమర్పించాలని స్పోర్ట్స్ సెక్రటరీ లవ్ అగర్వాల్‌ను ముఖ్యమంత్రి కోరారు. త్వరలోనే తెలంగాణకు సంబంధించిన క్రీడాకారులందరితో సమావేశమై విధానంపై చర్చిస్తామని ప్రకటించారు.

అంతర్జాతీయ క్రీడలలో స్వర్ణ పతకం సాధించిన వారికి రూ.50 లక్షలు, రజత పతకం సాధించిన వారికి రూ. 25 లక్షలు, ఇతర పతకాలు సాధించిన వారికి రూ. 15 లక్షల నగదు

ప్రోత్సాహం అందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారులను తీర్చి దిద్దిన కోచ్‌లకు కూడా క్రీడాకారులతో పాటుగా నగదు ప్రోత్సాహం ఇస్తామని చెప్పారు. బ్యాడ్మింటన్ క్రీడాకారులను తీర్చిదిద్దిన హైదరాబాద్‌కు చెందిన ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఆరీఫుద్దీన్, ప్రస్తుతం బ్యాడ్మింటన్ అకాడమీ నడుపుతున్న పుల్లెల గోపిచంద్‌కు రూ. 50 లక్షల చొప్పున నగదు ప్రోత్సాహం అందిస్తామని వెల్లడించారు. అంతర్జాతీయ క్రీడలలో పాల్గొనే క్రీడాకారులకు రూ. 3 లక్షల వరకు ఖర్చులు ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు. క్రీడాకారులకు ఇచ్చే నగదుకు ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరతామని చెప్పారు. క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలను ఆగష్టు 15న అందివ్వనున్నట్లు వెల్లడించారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించినప్పటికి ప్రోత్సాహం అందుకోని వారికి ఆ నగదును అందివ్వనున్నట్లు వెల్లడించారు. క్రీడాకారులు తాము రాణించడమే కాకుండా ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించాలని, తెలంగాణ రాష్ట్రం క్రీడలకు సరైన వేదికగా ప్రపంచం గుర్తించే విధంగా తయారు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. క్రీడాకారులను, క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం డబ్బుకు వెనకాడదని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా క్రీడాకారులను ముఖ్యమంత్రి ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో ఐటి శాఖ మంత్రి కె.తారక రామారావు, ప్రభుత్వ సలహాదారులు రమణాచారి, బివి.పాపారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, సిఎంఒ ముఖ్య కార్యదర్శి నర్సింగ్ రావు, స్పోర్ట్స్ సెక్రటరీ లవ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

---

**సిపిఆర్ఒ టు సిఎం**